# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

మంగళవారం / 19.03.2024 https://telanganaveena.com/ epaper.telanganaveena.com


# కవిత అరెస్టుపై సుఖేష్ సంచలన లేఖ





తెలంగాణ వీణ , జాతీయం :

దేశవ్యాప్తంగా ఢిల్లీ లిక్కర్ కేసు సంచలనం సృష్టించిన తెలిసిందే. ఈ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో కీలక మలుపు చోటు చేసుకుంది. ప్రస్తుతం కవిత ఈడీ కస్టడీలో విచారణ ఎదుర్కొంటుండగా.. ఆమె అరెస్టుపై మనీలాండరింగ్ కేసులో నిందితుడిగా ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ సంచలన లేఖ విడుదల చేశారు. జైలు నుంచి ఆయన రాసిన లేఖను సుఖేష్ లాయర్ మీడియాకు విడుదల చేశారు. ఇన్నాళ్లుగా తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, రాజకీయ కక్షసాధింపు అంటూ చెప్పినవన్నీ అబద్ధాలేనని కవిత అరెస్టుతో తేలిందని అన్నారు. నిజం బయటికొచ్చిందని.. చేసిన పనుల కర్మ ఫలం ఇప్పుడూ వెంటాడుతోందని అన్నారు. నిజం శక్తి ఏంటో తెలుసుకోవాలి. ఎదుర్కోవాల్సి ఉంటుంది. నన్ను ఎవరూ ఏమి చేయలేరని అనుకునేవారు. కానీ కొత్త భారతదేశంలో చట్టమే అన్నింటికన్నా శక్తివంతమైంది. నేను గతంలో మీడియాకు విడుదల చేసిన లేఖల్లో 2 అంశాలు పొందుపరిచాను. అందులో ఒకటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవుతుందని.. రెండోది తిహార్ క్లబ్‌లో చేరేందుకు కవితకు కౌంట్ డౌన్ మొదలైందని. ఈ రెండూ ఇప్పుడు నిజమయ్యాయని అనిపిస్తోంది. కవిత అరెస్టుతో అవినీతి పండోరా బాక్స్ ఓపెన్ అయింది. కవితతో పాటు ఆమె అవినీతి సహాయకులు, అవినీతి రాజు అరవింద్ కేజ్రీవాల్ చేసిన అక్రమాలన్నీ బయటపడతాయి.వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసి సింగపూర్, హాంగ్‌కాంగ్, జర్మనీ వంటి దేశాలకు పంపిన విషయాలు బయటికొస్తాయి. ఇది ఎవరికి అర్థం కావాలో వారికి అర్థమైందని అనుకుంటున్నాను. అక్కా!.. నేను వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్ల ద్వారా బయటపెట్టిన నెయ్యి డబ్బాల కథలు, రేంజ్ రోవర్ కలెక్షన్ కథలు, గోవా కథలు, కాంట్రాక్ట్ కథలు దర్యాప్తులో నిజమని తేలాయి. బయటపడే మార్గమే లేదు అక్కా. ఇప్పటికైనా నా విన్నపం ఒక్కటే.. అవినీతి సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్‌ను కాపాడేందుకు నిజాన్ని దాచే ప్రయత్నం చేయవద్దు. ఎందుకంటే ఈ దేశ ప్రజలు, న్యాయస్థానాలు నిజం తెలుసుకున్నాయి. ఇందుకు కావాల్సినంత సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నాయి.ఏదేమైనా ఈడీ, సీబీఐ కన్‌ఫ్రంటేషన్‌లో భాగంగా మిమ్మల్ని త్వరలోనే ముఖాముఖి చూస్తాను అక్కా. మా గ్రేటెస్ట్ తిహార్ జైలుకు స్వాగతం అక్కా. మీ మరో సోదరుడు, అవితిని సూత్రధారి అరవింద్ కేజ్రీవాల్ మీకు జైల్‌లో లగ్జరీ జీవితం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఉంటారు. ఈ లేఖను ముగించే ముందు మరొక్క మాట చెప్పదల్చుకున్నా.. సినిమా ఇంకా మిగిలే ఉంది. కేజ్రీవాల్ జీ.. తదుపరి ఇక మీరే. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదు. సినిమా క్లైమాక్స్‌కు చేరుకుంది. కేజ్రీవాల్ జీ.. నా సోదరసోదరీమణులకు తిహార్ క్లబ్‌కు స్వాగతం పలుకుతున్నాను.' అని సుఖేష్ చంద్రశేఖర్ లేఖలో పేర్కొన్నారు.కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులోనే అరెస్టైన సుఖేశ్ చంద్రశేఖర్ ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్నాడు. ఇప్పటికే ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితపై అనేకసార్లు సుఖేష్ సంచలన ఆరోపణలు చేశారు. కవితతో తాను చేసిన వాట్సాప్ చాట్‌తో పాటు అనేక స్క్రీన్ షాట్స్ గతంలో విడుదల చేసి సంచలనం సృష్టించారు. తాజాగా.. మరోసారి సుఖేశ్ కవిత అరెస్ట్‌పై స్పందించడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# తెలంగాణకు కొత్త గవర్నర్ నియామకం

తెలంగాణ వీణ , హైదరాబాద్:






తెలంగాణ గవర్నర్‌గా తమిళిసై సౌందర్య రాజన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. అదే సమయంలో రాష్ట్రాన్ని కొత్త గవర్నర్‌ను నియమించారు. ఝార్ఖండ్ గవర్నర్‌గా పని చేస్తున్న సీపీ రాధాకృష్ణన్‌కు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయనకే అదనపు బాధ్యతలు ఇచ్చారు.తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ బీజేపీలో క్రియాశీలకంగా పని చేశారు. ఆయన రెండుసార్లు కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి 1998, 1999లో ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలదించారు. 2004, 2014, 2019 సాధారణ ఎన్నికల్లో కోయంబత్తూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 2023 ఫిబ్రవరి 12న జార్ఖండ్ గవర్నర్‌గా నియమితుడయ్యాడు. తాజాగా ఆయన్ను తెలంగాణకు గవర్నర్‌గా, పుదుచ్చేరికి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.ఇక తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళిసై సోమవారం అనుహ్యంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఆమె రాజ్యాంగబద్ధమైన పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది. గతంలో బీజేపీలో పని చేసిన ఆమె.. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నరట. చెన్నై సెంట్రల్ లేదా తుత్తూకూడి నుంచి ఆమె బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.



# బాబా రాందేవ్‌కు షోకాజ్ నోటీసు

తెలంగాణ వీణ , జాతీయం :



ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌కి చెందిన పతంజలి సంస్థ వ్యాపార ప్రకటనలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొంటూ బాబా రాందేవ్‌కు షోకాజ్ నోటీసులు జారీచేసింది. న్యాయస్థానం ముందు విచారణకు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. పతంజలి ఆయుర్వేదం, ఆ సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణన్ ధిక్కార చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయనందుకు పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పేర్కొంది. యోగా గురువు రాందేవ్, బాలకృష్ణన్‌లు తమ ముందు హాజరుకావాలని, కంపెనీ ఉత్పత్తుల ప్రకటనలు, వాటి ఔషధ ప్రభావానికి సంబంధించిన ధిక్కార చర్యలపై స్పందించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.వ్యాక్సినేషన్ డ్రైవ్, ఆధునిక ఔషధాలకు వ్యతిరేకంగా రామ్‌దేవ్ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ సందర్భంగా పతంజలి వ్యవస్థాపకుడిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నవంబర్ 2023లో పతంజలి ఆయుర్వేద్ తన ప్రకటనలలో 'తప్పుడు' వాదనలు చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. అటువంటి పద్ధతులను ఆశ్రయించినందుకు ఆ సంస్థకు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. 'పతంజలి ఆయుర్వేదం అన్ని తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రకటనలు తక్షణమే నిలిపివేయాలి.. ఈ కోర్టు అటువంటి ఉల్లంఘనలను చాలా తీవ్రంగా పరిగణిస్తుంది.. ఒక నిర్దిష్టమైన వ్యాధిని నయం చేయగలదని తప్పుడు ప్రకటన చేసిన ప్రతి ఉత్పత్తిపై రూ. 1 కోటి వరకు జరిమానా విధించడాన్ని పరిశీలిస్తాం' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. కాగా, కరోనా వైరస్ కట్టడిలో ఆధునిక వైద్యం విఫలమైందని, అదో పనికిమాలిందంటూ బాబా రాందేవ్ చేసిన వ్యాఖ్యలపై అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. ఐఎంఏ సైతం ఆయనపై రూ.1,000 కోట్లకు పరువు నష్టం దావా వేసింది. విమర్శలు రావడంతో ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వివరణ ఇచ్చారు.. తాను ఉద్దేశపూర్వకంగా అలా అనలేదు, వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్‌ను చదివి వినిపించానని తప్పించుకునే ప్రయత్నం చేశారు.


# సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ లేఖ

తెలంగాణ వీణ , హైదరాబాద్:



'రజాకార్' మూవీ విషయమై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ నేత బండి సంజయ్ తాజాగా ఓ లేఖ రాశారు. ఈ సినిమాకు వినోదపు పన్ను నుండి మినహాయింపు ఇవ్వడంతో పాటు స్కూల్, కాలేజీ విద్యార్థులకు మూవీని చూపించాలని బండి సంజయ్ తన లేఖ ద్వారా సీఎంను కోరారు. రజాకార్ల రాక్షస పాలనలో తెలంగాణ ప్రజలు పడ్డ బాధలను కళ్లకు కట్టినట్లు చూపిన చిత్రం 'రజాకార్' అని అన్నారు. అలాగే నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించి స్వేచ్ఛా వాయువును అందించేందుకు జరిగిన పోరాటాలు, రజాకార్ల రాక్షసత్వంపై పోరాడి ప్రాణాలు విడిచిన యోధుల చరిత్ర, తెలంగాణ ప్రజలకు విమోచన కల్పించేందుకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని ఈ మూవీలో అద్భుతంగా చూపించారని బండి సంజయ్ కితాబిచ్చారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాన్ని తెలంగాణ ప్రజలకు అందించిన సినిమా దర్శక, నిర్మాతలకు, చిత్ర బృందానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఇలాంటి మంచి మూవీని తీసిన వారికి ప్రభుత్వపరంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బండి సంజయ్ గుర్తు చేశారు. తద్వారా ప్రజల్లోకి మంచి సందేశం పంపినట్లవుతుందని చెప్పుకొచ్చారు. ప్రధానంగా ఎన్నో ఆటుపోట్లను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని నిర్మించిన రజాకార్ సినిమాకు వినోదపు పన్ను నుండి మినహాయింపు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. థియేటర్లలో ప్రత్యేక షోలు వేసి, పాఠశాల, కళాశాల విద్యార్థులకు చూపించాలని కోరడం జరిగింది. దాంతో నాటి మహనీయులను స్మరించుకోవడంతో పాటు వారి పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఇంతటి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న 'రజాకార్' సినిమాను థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టేందుకు యత్నిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకుని ఇలాంటి సందేశాత్మక చిత్రాలను వీలైనంత ఎక్కువ థియేటర్లలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ తన లేఖలో పేర్కొన్నారు.

## రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న స్టార్ క్రికెటర్




తెలంగాణ వీణ, క్రీడలు :

శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగా తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌పై దృష్టిపెట్టేందకు ఈ బౌలింగ్ ఆల్‌రౌండర్ గతేడాది టెస్టులకు గుడ్‌బై చెప్పాడు. అయితే, తాజాగా శ్రీలంక క్రికెట్ బోర్డు సూచన మేరకు తన నిర్ణయం మార్చుకున్నాడు. ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ నెల 22 నుంచి బంగ్లాదేశ్‌తో జరిగే రెండు మ్యాచుల టెస్టు సిరీస్‌కు లంక జట్టుకు ఎంపికయ్యాడు. కాగా, హసరంగా 2020లో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు కేవలం నాలుగు టెస్టులు మాత్రమే ఆడాడు. ఏడు ఇన్నింగ్స్‌లలో ఒక హాఫ్ సెంచరీ సహాయంతో 196 పరుగులతో పాటు నాలుగు వికెట్లు తీశాడు. ఇక ఇప్పటికే శ్రీలంక టెస్టు జట్టులో ప్రబాత్ జయసూర్య, రమేష్ మెండీస్ వంటి నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. హసరంగా చేరికతో జట్టు స్పిన్ విభాగం మరింత పటిష్ఠంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీలంక క్రికెట్ బోర్డు జట్టుకు ధనుంజయ డి సిల్వాను కొత్త కెప్టెన్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇక ఐపీఎల్‌లో హసరంగా హైదరబాద్ సన్ రైజర్స్ (ఎస్ఆర్‌హెచ్) కు ఆడుతున్న విషయం తెలిసిందే. కానీ, బంగ్లాతో టెస్టు సిరీస్ కారణంగా అతడు ఎస్ఆర్‌హెచ్ ఆడే తొలి మూడు మ్యాచులకు అందుబాటులో ఉండడని సమాచారం.

# పార్టీ మారడం లేదు..

\- ఎర్రబెల్లి దయాకర్ రావు



తెలంగాణ వీణ , హైదరాబాద్:

బీఆర్ఎస్ కీలక నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే దానం నాగేందర్, రంజిత్ లు కాంగ్రెస్ లో చేరారు. తాజాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేరు బయటకు వస్తోంది. ఎర్రబెల్లి బీజేపీలో చేరబోతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ వార్తలపై ఎర్రబెల్లి స్పందించారు. తాను బీజేపీలో చేరబోతున్నాననే వార్తల్లో నిజం లేదని ఆయన అన్నారు. కావాలనే కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీ అభివృద్ధి కోసం ఒక సైనికుడిలా పని చేస్తానని ఎర్రబెల్లి చెప్పారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్, పాలకుర్తి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ను బలహీనపరిచేందుకే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని అన్నారు. కార్యకర్తలను తప్పుదోవ పట్టించేందుకే ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ల్యాండ్ దందాలు, బిజినెస్, తప్పుడు పనులు చేసే నాయకులే పార్టీలు మారుతారని చెప్పారు. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ పై ఎర్రబెల్లి స్పందిస్తూ... ఆయన ఎవరో కూడా తనకు తెలియదని అన్నారు. ట్యాపింగ్ వ్యవహారంలో తన పేరు చెప్పాలని ప్రణీత్ రావుపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల పాలన ఫ్లాప్ అయిందని అన్నారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని చెప్పారు. మోసాలు చేయడం, మాయ మాటలు చెప్పడం రేవంత్ కు అలవాటేనని అన్నారు.